క్లుప్తంగా

యూనివర్సిటీ టాపర్ రమ్యకు సత్కారం



యూనివర్సిటీ టాపర్ రమ్యను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

విజయనగరం అర్బన్: ఆంధ్రా యూనివర్సిటీ బీబీఏ డిగ్రీలో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన కొమ్మూరు రమ్యను శుక్రవారం స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మీ చేతుల మీదుగా రూ.50 వేల నగదు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిదేవమణి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, మేనేజ్‌మెంట్ స్టడీస్ శాఖ హెడ్ డాక్టర్ వరూధిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వితరణ



కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు రూ. 10 వేల చెక్కును అందజేస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల 15 నుంచి ప్రారంభించనున్న అన్నా క్యాంటీన్‌కు కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు రూ. పది వేలను విరాళంగా అందజేశారు. కేంద్ర మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం స్థానిక అశోక్ బంగ్లాకు వచ్చారు. దీంతో అశోక్ గజపతిరాజు కలెక్టర్‌కు చెక్ అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే పి.అదితిగజపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేస్తాం..



ప్లాంట్ యాజమాన్యంతో మాట్లాడుతున్న పంచాయతీ అధికారి శ్రీనివాసరావు

పూసపాటిరేగ : మండలంలోని గాయత్రీ మినరల్ వాటర్ ప్లాంట్‌పై గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తామని మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాయత్రీ మినరల్ వాటర్ ప్లాంట్ యాజమాన్యంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాటర్ ప్లాంట్ పాటించాల్సిన నిబంధనలను యాజమాన్యానికి వివరించారు. రెండు రోజులులో ప్లాంట్‌ను పరిశీలించి, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ బి. రవికుమార్ ఉన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

• ఎంపీడీఓ రాధిక



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ : మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీఓ ఎం.రాధిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలో తీరప్రాంతం ఉన్నందున లోతట్టు ప్రాంతాలు, సముద్రం దగ్గర ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. ఆమెతో పాటు మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ



జామి: ఆషాడమాసం శుక్రవారం సందర్భంగా మండల కేంద్రంలోని కనకదుర్గమ్మ అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు భగవాన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ముసురుకుంది..

- విస్తారంగా కురుస్తున్న వర్షాలతో తడిసి ముద్దయిన విజయనగరం
- అల్పపీడనం ఎఫెక్ట్‌తో వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- సాగుకు మేలంటున్న అన్నదాతలు



యుద్ధప్రాతిపదికన కాలువల్లో పూడికలు తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది



నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటిని మళ్లించేందుకు చర్యలు చేపడుతున్న దృశ్యం

విజయనగరం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో విజయనగరం జిల్లా కేంద్రం తడిసిముద్దయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తరంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ప్రారంభమైన వర్షం రాత్రంతా కురిసింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఉద్యోగులు వర్షంలోనే రాకపోకలు సాగించారు. అదేవిధంగా వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సైతం ఇబ్బందులు పడ్డారు. నగరంలో రోడ్డుపై చిరు వ్యాపారాలు చేసుకునే వారు వర్షంలోనే వ్యాపారాలు చేస్తూ అవస్థలు పడ్డారు. ఇదిలా ఉండగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు అదును దాటిపోతున్న సమయంలో వర్షాలు కురవడంతో అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు. ఇప్పటికే వేసిన నారుమడులకు వర్షాలు ఎంతో మేలు చేయడంతో పాటు కొత్తగా నారు వేసేందుకు వెసులుబాటు ఉందని రైతులు చెబుతున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు సిబ్బందిని ఆదేశించారు. వర్షపు నీరు నిలిచిన ఉన్న ప్రాంతాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. జేసీబీ సహాయంతో వర్షపు నీరు పల్లపు ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. కంటోన్మెంట్, ఉడా కాలనీ, తదితర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు కురవనున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాలలో వర్షపు నీరు నిల్వ ఉందన్న సమాచారం మేరకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వీలైన చోట్ల కాలువల్లో అడ్డంకులు తొలగించామని, ఇబ్బందికర ప్రాంతాల్లో జేసీబీ సహాయంతో వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించామన్నారు.

సీఆర్‌జెడ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

విజయనగరం అర్బన్: జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని తీరప్రాంతాల్లో అమలు చేయనున్న 'కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్'పై కాలుష్య నియంత్రణ మండలి శుక్రవారం ప్రజాభిప్రాయాలను సేకరించింది. తీర గ్రామాల్లో నిర్వహించాల్సిన ప్రజాభిప్రాయ సేకరణను కలెక్టరేట్‌లో నాలుగు గోడల మధ్య నిర్వహించడం విమర్శలకు తావిచ్చింది. తీర గ్రామాల నుంచి వచ్చిన అరకొర మంది నుంచి అభిప్రాయాలను సేకరించడం వల్ల అనుకున్న లక్ష్యం నెరవేరదన్న అభిప్రాయం వ్యక్తమైంది. జేసీ కె.కార్తీక్ మాట్లాడుతూ తీరప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధి పనులకు సీఆర్‌జెడ్-2019 నోటిఫికేషన్ దోహద పడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన తాజా నోటిఫికేషన్ మేరకు జిల్లా స్థాయి కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందించాల్సి ఉందన్నారు. దీనికి ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. తీరప్రాంతంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వివిధ వర్గాల అవసరాల ఆధారంగా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. దేశంలో 2011 నాటి సీఆర్‌జెడ్ నిబంధనలే అమలులో ఉన్నాయని, 2019 నోటిఫికేషన్‌కు అందరి ఆమోదం లభిస్తే ఇది అమలులోకి వస్తుందన్నారు. సీఆర్‌జెడ్ ప్రాంతాన్ని కుదించడం వల్ల తీరానికి మరింత దగ్గరగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టే అవకాశం కలుగుతుందన్నారు. మత్స్యకారుల ఆవాసాలు కూడా సముద్రతీరానికి గతంలో కంటే మరింత సమీపంలో ఏర్పాటు చేసుకునే వీలుకలుగుతుందని వెల్లడించారు. కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ సరిత, కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధులు యోగరాజ్, కరుణానిధి సీఆర్‌జెడ్-19లోని అనుకూలాంశాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని పలు గ్రామాల ఎంపీటీసీలు, మాజీ స్థానిక ప్రతినిధులు మాట్లాడుతూ తీరప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న రసాయనిక, ఫార్మా పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యకారక వ్యర్థాలతో సముద్రజలాలు కలుషితమై మత్స్య సంపద తగ్గిపోతుందన్నారు. జీవన పరిస్థితులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల వ్యర్థాలు శుద్ధిచేశాక సముద్రంలోకి విడిచిపెట్టేలా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మత్స్యకార ప్రతినిధులు బర్రి చిన్నప్పన్న, మైలుపల్లి సింహాచలం, తాత, అప్పలసూర్యనారాయణ, నూకరాజు, ఎంపీటీసీ పతివాడ అప్పలనాయుడు మాట్లాడారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పరవాడ సాయివిజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు వన్ స్టాప్ సెంటర్ సేవలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న మహిళల రక్షణ కోసం 181 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వన్‌స్టాప్ సెంటర్‌లో మహిళకు రక్షణ, సంరక్షణ, వైద్యం, న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా కంటోన్మెంట్ యూనియన్ బ్యాంక్‌లో కూడా వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది బ్యాంక్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కిల్లాడ రమాదేవి, నాగమణి, విద్య, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ వచ్చేలా కృషి చేస్తా..

• ఎంపీ కలిశెట్టి..



ఎంపీ కలిశెట్టిని సత్కరిస్తున్న పీవీఆర్, తదితరులు

విజయనగరం టౌన్: తెలగా కులస్తులకు బీసీ రిజర్వేషన్ వచ్చేలా కృషి చేస్తామని విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఉత్తరాంధ్ర తెలగ కులస్తుల ఉద్యమనేత పల్లంట్ల వెంకట రామారావు (పీవీఆర్)ను ఆయన కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తెలగ కులస్తుల రిజర్వేషన్ కోసం పీవీఆర్ చేసిన 668 కిలోమీటర్ల పాదయాత్ర చిరస్మరణీయమన్నారు. తాను కూడా పాదయాత్రలో పాల్గొన్నానని తెలిపారు. తెలగ కులస్తులకు బీసీ రిజర్వేషన్ ఆవశ్యకత తనకు తెలుసునన్నారు. అనంతరం పీవీఆర్, తెలగ కుటుంబ సభ్యులు ఎంపీని సత్కరించారు.

ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి

• నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ: ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నెల్లిమర్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇంటింటి కుళాయిలు, అందుకు తగిన విధంగా ట్యాంక్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెప్పారు. డెంకాడ ఎంపీటీసీ సభ్యురాలు కుమారి మాట్లాడుతూ.. డెంకాడ గ్రామంలో కుళాయిల ద్వారా కలుషిత నీరు వస్తోందని, దీంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీనికి ఎమ్మెల్యే నాగమాధవి స్పందిస్తూ, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రజలకు ఉత్తమ సేవలు అందించి ఆదర్శంగా నిలవాలని కోరారు. అక్కివరం ఎంపీటీసీ సభ్యుడు కంది చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఏఓ నిర్మలను కోరారు. అనంతరం వైద్యారోగ్య శాఖాధికారుల సమీక్షలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున నీరు కలుషితం కావడంతో పాటు పరిసరాల అపరిశుభ్రత వల్ల కూడా వ్యాధులు ప్రబలుతాయని, ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం శాఖ సమీక్షలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని కోరారు. మోదవలస ఎంపీటీసీ సభ్యురాలు బోని యువశ్వేత మాట్లాడుతూ.. మోదవలస పంచయతీలోని గొండపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నప్పటికీ ఈ గ్రామానికి 24 గంటల విద్యుత్ సరఫరా లేదని, గ్రామానికి నిరంతర విద్యుత్ అందించాలని కోరారు. హౌసింగ్ డీఈ మురళి మాట్లాడుతూ... ఇళ్ల నిర్మాణం డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీలు పిన్నింటి తమ్మునాయుడు, కూరాకుల అనిత, ఎంపీడీఓ లవరాజు, తహసీల్దార్ రామారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు తగవు

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హత్యారాజకీయాలు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు కావాలనే దాడులు చేస్తున్నారన్నారు. వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తను నడిరోడ్డుపై నరికి చంపడం దారుణమన్నారు. ప్రజలందరూ టీడీపీ చేస్తున్న విధ్వంసకాండను గమనిస్తున్నారని చెప్పారు. హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పరిహారం మంజూరు..

విజయనగరం ఫోర్ట్ : విజయనగరం రూరల్ డివిజన్ వేపాడ సెక్షన్ ఎస్‌కేఆర్ పురం సచివాలయంలో పనిచేస్తున్న సమయంలో ఏప్రిల్ 2న జరిగిన ఓ ప్రమాదంలో ఎనర్జీ అసిస్టెంట్ గొర్రిపాటి లీలాకుమార్ ఎడమ చేయి కాలిపోయింది. దీంతో మోచేయి వరకు తొలగించారు. ఈ విషయాన్ని విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ, సీఎండీ దృష్టికి వెళ్లడంతో అతనికి రావాల్సిన వర్క్‌మన్ కాంపెన్సేషన్, స్పెషల్ డిజాబిలిటీ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఫీల్డ్ నుంచి ఆఫీస్‌కు బదిలీ, తదితర అనుమతులను సీఎండీ పృథ్వీతేజ్ శుక్రవారం మంజూరు చేశారు.

సీహెచ్‌సీ తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో 8 మంది సిబ్బంది విధుల్లో ఉండాల్సి ఉండగా.. ఇద్దరు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా ఎక్కువ మంది డాక్టర్లు ఉదయం 10 గంటలకు వచ్చి 12 గంటలకు వెళ్లిపోతున్నారని.. హాస్పిటల్ సూపరింటెండెంట్ కూడా అందుబాటులో ఉండటం లేదని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే పై అధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని చెప్పారు. తనిఖీల్లో టీడీపీ నాయకుడు అప్పలనాయుడు, బైరెడ్డి కల్యాణ్, ముడిమంచి లక్ష్మణరావు, మజ్జి ఆదినారాయణ, జనసేన నాయకులు బంగారు శంకరరావు, భానుప్రకాష్, రవ్వా నాని, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

చీపురుపల్లి: ఈ నెల 21న ఆషాడ శుద్ధ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి. వెంకటరావు అన్నారు. స్థానిక శ్రీనివాసా జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మత్తు కలిగించే గంజాయి, డ్రగ్స్, గుట్కా, ఖైనీ వంటి వాటిని వినియోగించి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించాలని ఆకాంక్షించారు. డ్రగ్స్, గంజాయి రవాణా, వినియోగంపై సమాచారం తెలిస్తే డయల్ 100కి గాని 91211 09419 నంబర్‌కు గాని తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై హరిబాబునాయుడు, నవీన్‌పడాల్, తారకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా ఉజ్వల భవిష్యత్



స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేసిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

• జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ అన్నారు. భారత సెంట్రల్ మినిస్టర్ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ గుర్తింపుపొందిన హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోషియేషన్ రాష్ట్ర చైర్మన్ రాజగిరి హరివిఠల్, రాష్ట్ర కార్యదర్శి దుంపల వెంకట అప్పలనాయుడులు శుక్రవారం ఆమెను యూనివర్సిటీలో కలిశారు. అసోసియేషన్ ద్వారా కళాశాలలో నిర్వహించాలనుకున్న కార్యకలాపాలను ఆమెకు వివరించి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జేఎన్‌టీయూ జీవీ అనుబంధ కళాశాలల్లో నిర్వహించబోతున్న కార్యకలాపాలకు అనుమతులు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు గొల్లపూడి పృథ్వీరాజ్, గుడివాడ కల్యాణి, జేఎన్‌టీయూ జీవీ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏవీపాపారావు, పీడీ నాగరాజు, స్కౌట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

• కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు



హాజరైన వార్డు సచివాలయ కార్యదర్శులు

విజయనగరం: ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కార్యదర్శులు సమన్వయంతో కృషి చేయాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో వార్డు సచివాలయ అడ్మిన్, ఎమినిటీస్, శానిటేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయాల వారీగా స్థానికంగా నెలకొన్న సమస్యలు, చేపడుతున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గుంతలు, నీటి పన్ను వసూళ్లు, తుప్పలతో కూడిన స్థలాలు, ఖాళీ స్థలాలపై పన్నుల విధింపు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కమిషనర్ మల్లయ్యనాయుడు మాట్లాడుతూ.. కార్యదర్శుల మధ్య సమన్వయ లోపం ఉన్నట్లు గుర్తించామని, అందువల్ల ప్రతివారం కార్యదర్శులతో సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా మూడు విభాగాలకు చెందిన కార్యదర్శులతో సమీక్ష చేపట్టామన్నారు. మూడు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ఏసీపీలు మధుసూదనరావు, అమ్మాజీరావు, ఆర్ఓ శ్రీనివాసరావు, డీఈలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు రాము, వెంకటేష్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని తెలిపారు. 2019లో జిల్లాకు కేటాయించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇప్పటికీ సొంత భవనం నిర్మించలేదని.. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇప్పటికీ తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అదేవిధంగా పట్టణంలో ఉన్న బీపీఎం, కస్పా, గాజులరేగ హైస్కూళ్లలో సౌకర్యాల కొరత దారుణంగా ఉందని తెలిపారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి పి. రమేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల విధానంలో మాట మార్చడం సరికాదు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

• ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్

విజయనగరం ఫూల్‌బాగ్: వైద్యవిద్యను వ్యాపారంగా మార్చిన ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ విజయనగరం జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి ఎం. సాయికుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. నాగభూషణం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ఐదు ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో జీఓ 107 , 108లను రద్దు చేసి, పాత పద్ధతిలో ఫీజుల విధానాన్ని కొనసాగించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో ఐదు కళాశాలల్లో గత సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయని చెప్పారు. అయితే ఎన్నడూ లేని విధంగా ఫీజులు పెంచడం దారుణమని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ జీఓలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీశంకర్, పట్టణ కార్యదర్శి ఎ. సుమన్, జగదీష్, రాము, తదితరులు పాల్గొన్నారు.